సాక్షి
యాదాద్రి భువనగిరి

ఆదివారం । 18 । జూన్ । 2023



మెరుగైన ఉపాధి అవకాశాలు

సాంకేతిక రంగంలోనే మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని డాక్టర్ కేవీకే రావు అన్నారు. - 9లో



యాదాద్రిలో గిరి ప్రదక్షిణ

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా యాదాద్రి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ, నగర సంకీర్తన నిర్వహించారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం 41°/29°

వాతావరణం

పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడం వల్ల ఉక్కపోతగా ఉంటుంది.

కొడుకు అప్పులు.. నాన్నకు తిప్పలు!



బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువత

- అప్పు తెచ్చి ఆన్‌లైన్ గేమ్స్
- తీర్చేమార్గం లేక, ఇంట్లో చెప్పలేక ఆత్మహత్య
- తండ్రిపై పడుతున్న భారం
- అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిడి

సాక్షి, యాదాద్రి : ఆన్‌లైన్ గేమ్స్ నిండు ప్రాణాలను బలిగొనడమే కాకుండా కుటుంబాలను ఆర్థికంగా చిదిమేస్తున్నాయి. బెట్టింగ్ కోసం చేసిన అప్పులు తీర్చలేక, ఇంట్లో చెప్పలేక ఎంతో మంది యవకులు మనస్తాపంతో తనువు చాలిస్తున్నారు. చివరికి అప్పులిచ్చిన వాళ్లు కన్నవారిపై పడుతున్నారు. ఇంటికి వచ్చి వత్తిడి చేయడం, ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడుతుండడంతో తండ్రులు బోరున విలపిస్తున్నారు. ఆస్తిపాస్తులు అమ్మి కొడుకు చేసిన అప్పులు తీరుస్తున్నారు.

రూ.వేల నుంచి రూ.లక్షల్లో బెట్టింగ్

క్రికెట్, కబడ్డీ, రమ్మీ.. ఇలా అనేక రకాల ఆన్‌లైన్ గేమ్స్‌కు యువత బానిసలుగా మారుతున్నారు. ఒకప్పుడు బెట్టింగ్ అతికొద్ది మందికి సంబంధించిన వ్యవహారంగా ఉండేది. ప్రస్తుతం ఈ ఉచ్చులో చిక్కుకోని వారు లేరంటే అతిశయోక్తి కాదు. నగరాలకే పరిమితమైన ఈ విష సంస్కృతి నేడు పట్టణాలు, పల్లెలకు పాకింది. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలన్న ఉద్దేశంతో బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. యువకులు, విద్యార్థులు గ్రూపులుగా ఏర్పడి రూ.వేల నుంచి రూ.లక్షల్లో బెట్టింగ్ పెడుతున్నారు. ఇందులో కొందరు అధిక మొత్తంలో డబ్బులు పోగుట్టుకుని, అవమానంతో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. వెలుగులోకి వస్తున్న సంఘటనలు కొన్నయితే వెలుగులోకి రానివి వందల్లో ఉన్నాయి.

వెలుగుచూసిన ఘటనలు కొన్ని

- యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం గ్రామానికి చెందిన రాజుగౌడ్(22) ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ పెట్టి పెద్ద ఎత్తున డబ్బులు కోల్పోయాడు. చివరికి మనస్తాపం చెంది మే 30న వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి మృతి చెందాడు.
- యాదగిరిగుట్ట మండలం చిన్నకందుకూరుకు చెందిన డిగ్రీ విద్యార్థి సాయితేజ (21) కొంత కాలంగా ఆన్‌లైన్ ఆటలకు అలవాటు పడ్డాడు. బెట్టింగ్ పెట్టి అప్పుల్లో కూరుకుపోయాడు. విషయం తండ్రికి తెలియడంతో మందలించాడు. దీంతో సాయితేజ మనస్తాపానికి గురై ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడు రోజుల తర్వాత జనగాం జిల్లా రఘునాథపల్లిలో ఉరేసుకొని మృతి చెందాడు.
- భువనగిరికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారాడు. బ్యాంకులు, ఆన్‌లైన్ బ్యాంకులు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ.15 లక్షల అప్పులు చేశాడు. బ్యాంకు అధికారులు ఫోన్ చేసే వరకు తన కుమారుడు అప్పు చేసిన విషయం తండ్రికి తెలియదు. పూర్తిగా ఆరా తీయగా అప్పుల కుప్ప బయట పడింది. దీంతో కొడుకు చేసిన అప్పుడు తీర్చడానికి తండ్రి నానా యాతన పడుతున్నాడు.
- ఆలేరు పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆన్‌లైన్ గేమ్స్‌లో బెట్టింగ్ పెట్టడానికి రూ.30 లక్షలు అప్పు చేశాడు. అప్పులు తీర్చే పరిస్థితి లేకపోవడంతో అప్పులిచ్చిన వాళ్లు తండ్రి వద్దకు వచ్చి ఒత్తిడి తెస్తున్నారు. రోజూ ఫోన్లు చేయడమే కాకుండా దూషించడం, బెదిరింపులకు పాల్పడుతున్నారు. తట్టుకోలేక యువకుడి తండ్రి అప్పు తెచ్చి కొడుకు అప్పులు తీర్చాడు.

అందినకాడల్లా అప్పు

ఆన్‌లైన్, ఐపీఎల్ సీజన్లలో బెట్టింగ్ పెట్టడానికి యువకులు పలుమార్గాల ద్వారా డబ్బులు సమకూర్చుకుంటున్నారు. కొందరు వ్యక్తులు తమ వాహనాలను సైతం తాకట్టు పెట్టి డబ్బులు సమకూర్చుకుంటుండగా మరికొందరు ఇంట్లో బంగారాన్ని తాకట్టు పెడుతున్నారు. ఇంకొంతమంది తెలిసినవారి వద్ద అప్పులు తీసుకుంటున్నారు. ప్రభుత్వ బ్యాంకులు, ఆన్‌లైన్ బ్యాంకులు, ప్రైవేట్ చిటీలు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పు తెస్తున్నారు. చివరికి తమ కొడుకులు చేసిన అప్పు తెలిసి తండ్రులు గుండెలు బాదుకుంటున్నారు. కొందరు పరువుపోతుందన్న ఉద్దేశంతో విషయం బయటకు పొక్కకుండా అప్పులు తీరుస్తున్నారు.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో కొనసాగుతున్న ఈవీఎంల మొదటి లెవల్ తనిఖీలో భాగంగా శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్‌పోల్ నిర్వహించారు. ఈ కార్యక్రమం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు బట్టు రామచంద్రయ్య, ఏశాల అశోక్, కొండమడుగు నర్సింహ, పుట్ట రమేశ్, భాస్కర్,రమేశ్, బి.శ్రీకాంత్, జి.రాహుల్, ఎన్నికల విభాగం డీటీ సురేశ్, అధికారులు పాల్గొన్నారు.

నేడు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాక

భువనగిరిటౌన్ : రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు అదనపు కలెక్టరు డి.శ్రీనివాసరెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటారని, అనంతరం 10.30కి భువనగిరి బైపాస్ రోడ్డులో గల న్యూ దీప్తి హోటల్‌లో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ సదస్సులో పాల్గొంటారని పేర్కొన్నారు. తిరిగి మధ్యాహ్నం 12.00 గంటలకు హైదరాబాద్ బయలుదేరి వెళ్తారని తెలిపారు.

డీజీపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు



డీజీపీ కార్యాలయం నుంచి వస్తున్న కాంగ్రెస్ నాయకులు కోదండరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరుతూ శనివారం పలువురు కాంగ్రెస్ నాయకులు డీజీపీని కలిశారు. రాయగిరి రైతులు గతంలోనే పలు ప్రాజెక్టులకు భూములు ఇచ్చారని, ఉన్న కొద్దిపాటి భూములను ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డులో కోల్పోవాల్సి వస్తుందని డీజీపీకి వివరించారు. డీజీపీని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరెడ్డి, మాజీ ఎంపీ వీహెచ్ హనుమంతరావు, డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, రవికుమార్ ఉన్నారు.

గుట్ట మున్సిపాలిటీకి ఉత్తమ అవార్డు



మున్సిపల్ చైర్‌పర్సన్ సుధ, కమిషనర్‌కు అవార్డు అందజేస్తున్న మంత్రి కేటీఆర్

యాదగిరిగుట్ట : మున్సిపల్ ఇన్నోవేటివ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో యాదగిరిగుట్ట మున్సిపాలిటీని ఉత్తమ అవార్డు వరించింది. శుక్రవారం హైదారాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా చైర్‌పర్సన్ ఎరుకల సుధ, కమిషనర్ బాలకృష్ణ అవార్డు అందుకున్నారు. 25వేల లోపు జనాభా కేటగిరీలో అవార్డు అందజేశారని చైర్‌పర్సన్ ఎరుకల సుధా వెల్లడించారు.

యాదగిరిగుట్ట ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా జ్యోతి

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఏ.జ్యోతి నియామకం అయ్యారు.ప్రస్తుతం ఆమె మెటకొండూర్ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో పాటు గుట్ట బాధ్యతలు అప్పగించినట్లు ఆర్డీఓ భూపాల్‌రెడ్డి తెలిపారు. నేటి నుంచి యాదగిరిగుట్ట మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తారని పేర్కొన్నారు.

ముగిసిన సప్లిమెంటరీ

భువనగిరి : ఇంటర్‌మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ జనరల్ పరీక్షలు శనివారం ముగిశాయి. శనివారం జరిగిన రసాయన శాస్త్రం పరీక్షకు 726 మంది విద్యార్థులకు 679 మంది హాజరయ్యారు. 47 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో రమణి తెలిపారు.

నేడు మంచినీళ్ల పండుగ

భువనగిరి టౌన్ : రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెలంగాణ మంచి నీళ్ల పండుగ నిర్వహించనున్నారు. ఇందు కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నల్లగొండ పరువు తీస్తున్నారు



నల్లగొండ సమీపంలో పాదయాత్ర చేస్తున్న భట్టి విక్రమార్క, చిత్రంలో ఉత్తమ్ పద్మావతి, చెరుకు సుధాకర్

- బీఆర్ఎస్ నేతలు జిల్లా పౌరుషాన్ని గజ్వేల్ గడీల దగ్గర తాకట్టుపెట్టారు
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

నల్లగొండ: బీఆర్ఎస్ నాయకులు నల్లగొండ జిల్లా పౌరుషాన్ని గజ్వేల్ గడీల దగ్గర తాకట్టుపెట్టి.. పరువు తీస్తున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శనివారం నల్లగొండ మండలం జి.చెన్నారం నుంచి రాత్రి 9గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా గడియారం సెంటర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో భట్టి విక్రమార్క మాట్లాడారు. పోరాటాల గడ్డగా పేరొందిన నలగొండ జిల్లాలో దేశానికి దిశానిర్దేశం చేసిన నాయకులు చాలా మంది ఉన్నారని.. రావి నారాయణరెడ్డి లాంటి వారు నెహ్రూ దగ్గర జిల్లా గౌరవాన్ని నిలబెట్టే విధంగా పని చేశారని చెప్పారు. రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తే జిల్లాలో లక్షలాది ఎకరాలకు నీళ్లు ఇచ్చే ప్రాజెక్టులు పూర్తయ్యే అవకాశం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదన్నారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి జగదీష్‌రెడ్డి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయించడానికి ఇంతకాలం ఏం చేశారని ప్రశ్నించారు. వారు ప్రాజెక్టుల గురించి మాట్లాడకుండా తాను కట్టుకున్న గోసి, పంచె, లస్కర్ల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అధికా రం కోసం అర్రులు చాచే గుత్తా సుఖేందర్‌రెడ్డి పొద్దు తిరుగుడు పువ్వు మాదిరిగా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీలోకి మారిన వ్యక్తి అని విమర్శించారు.

దశాబ్ది ఉత్సవాలెందుకో..


అభివృద్ధి పనుల బిల్లులు రాక సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటోందని ఎద్దేవా చేశారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేడానికి కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ సీట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పార్టీ బాధ్యతల కారణంగా వేరే ప్రాంతానికి వెళ్లాల్సి వచ్చిందని.. అయినప్పటికీ నియోజకవర్గంలోని తన అనుచరులను పంపించి పాదయాత్రకు సహకరిస్తున్నారని చెప్పారు.

ఒక్క పోస్టూ భర్తీ చేయలే.. : ఉత్తమ్

నల్లగొండ ఎంపీ, పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదన్నారు. కాంగ్రెస్ లక్షల్లో ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వగా, బీఆర్ఎస్ పాలనలో వందల సంఖ్యలో కూడా ఇవ్వలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో 12 నియోజక వర్గాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క సమక్షంలో ఉత్త మ్ పద్మావతి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం పాదయాత్ర పానగల్‌కు చేరుకుంది.కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్, రాష్ట్ర నాయకుడు దుబ్బాక నర్సింహారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, గుమ్ముల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

- పరిశీలించిన దేవాదాయ శాఖ కమిషనర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్, ఈఓ

యాదగిరిగుట్ట : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21న యాదాద్రిలో ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి దేవస్థానం ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఈఓ గీతారెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆధ్యాత్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించాలని, అదే రోజు కవులను సన్మానించాలని సూచించారు. అంతేకాకుండా కొండ కింద దేవస్థానం బస్టాండ్, అన్నదాన సత్రం భవనాల ప్రారంభం, కొండపైన వెండి నాణేల విక్ర యం, ప్రసాద విక్రయశాలలో చిరు ధాన్యాలతో తయారు చేసిన ప్రసాదం పంపిణీ, ఆన్‌లైన్ టిక్కెట్ సేవలను ప్రారంభించడంతో పాటు వేద పాఠశాలకు దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. అనంతరం సత్యనారాయణస్వామి వ్రత మండపంలో దేవాదాయశాఖ ప్రగతి నివేదన సభ నిర్వహించాలని ఆదేశించారు. అంతకు ముందు ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు కల్పిస్తున్న వసతులపై ఈఓతో చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ భాస్కర్‌శర్మ, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

దళితబంధుపై పంజాబ్ మంత్రి ఆరా

తుర్కపల్లి: మండలంలోని వాసాలమర్రిని శనివారం పంజాబ్ రాష్ట్ర సామాజిక న్యాయం, మైనార్టీ సంక్షేమ శాఖమంత్రి బల్జీత్ కౌర్, సామాజిక న్యాయం, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రమేశ్‌కుమార్ అధికారులతో కలిసి సందర్శించారు. దళిత వాడల్లో తిరుగుతూ లబ్ధిదారులను కలిసి వారి జీవన విధానాన్ని పరిశీలించారు. లబ్ధిదారులు గ్యార అండాలు, చెన్నూరి లక్ష్మిని కలిసి వివరాలు అడిగారు. యూనిట్ నిర్వహణ, ఆదాయం వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో జీవితం ఎలా ఉంది పథకం అమలు తర్వాత వచ్చిన మార్పులేమిటని అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు మరికొందరు లబ్ధిదారులను కలిశారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి జస్‌ప్రీత్‌సింగ్, డైరెక్టర్ ఆశిష్‌కుతూరియా, స్టేట్ నోడల్ ఆఫీసర్ పంజాబ్ రాష్ట్ర ఇన్‌చార్జ్ జగదీశ్ శర్మ, అడిషనల్ కలెక్టర్ దీపక్‌తివారి, డీడీ కిషన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, సర్పంచ్ పోగుల ఆంజనేయులు, ఎంపీడీఓ ఉమాదేవి, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి

ప్రపంచాన్ని పరిచయం చేసేది నాన్నే

- విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి

'ప్రపంచాన్ని మనకు పరిచయం చేసేది నాన్నే' అని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఫాదర్స్‌డేను పురస్కరించుకుని ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. 'మన జీవితం అమ్మది.. జీవనం నాన్నది' అని చెప్పారు. 'మా నాన్న రామచంద్రారెడ్డి ఉపాధ్యాయుడు కావడంతో చిన్నతనం నుంచే నాకు నాయకత్వ లక్షణాలునేర్పారు' అని పేర్కొన్నారు. నాన్న ఎప్పుడూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని.. ఉన్నతంగా బతకాలని చెప్పేవారని తెలిపారు. ఆయన చూపిన బాటలో తాను నడుస్తున్నానని.. రాజకీయంగా కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్తున్నానని చెప్పారు.



తండ్రి రామచంద్రారెడ్డితో మంత్రి జగదీష్‌రెడ్డి

నాన్నే తొలి హీరో - వివరాలు 8లో

గిరిజన బాంధవుడు సీఎం కేసీఆర్



గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న కలెక్టర్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, కలెక్టర్

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

బొమ్మలరామారం : సీఎం కేసీఆర్ గిరిజన బాంధవుడని, గిరిజనుల అభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశపెట్టారని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బొమ్మలరామారం మండలంలోని పిల్లిగుండ్లతండాలో శనివారం నిర్వహించిన గిరిజనోత్సవంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టానియా చొంగ్‌టో, కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి పాల్గొన్నారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపడం కోసం సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా 3,146 తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. గిరిజనుల ఆత్మగౌరవం ప్రతిబింబించేలా బంజారా భవన్ నిర్మించడంతో పాటు గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా 94 గురుకులాలు, 22 డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసి వారి విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తుందన్నారు. విదేశాల్లో చదువుకునేందుకు విద్యారుణం అందిస్తుందని తెలిపారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ప్రభుత్వ విప్ సునీత పేర్కొన్నారు. తుర్కపల్లి మండలంలోని పల్లెపహాడ్, గొల్లగూడెం నుంచి పిల్లిగుండ్ల తండాకు త్వరలో కాళేశ్వరం జలాలు అందజేస్తామన్నారు. సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని, అర్హులకు గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు, ఆసరా పింఛన్లు మంజూరు చేస్తామని చెప్పారు. అనంతరం విప్ సునీత, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, కలెక్టర్ గిరిజన సంప్రదాయ దుస్తులు ధరించి గిరిజనులతో కలిసి నృత్యం చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, జెడ్పీ వైస్‌చైర్మన్ బీకునాయక్, ఎంపీపీ సుధీర్‌రెడ్డి, తహసీల్దార్ పద్మసుందరి, ఎంపీడీఓ సరిత, ఎంపీఓ మాలిని, ఏపీఎం రమణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుషంగల సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ బాల్ నర్సింహ, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, ఎంపీటీసీ కుర్మిండ్ల అనితాఈశ్వర్‌గౌడ్, మన్నె శ్రీధర్, సర్పంచ్ మోతి, కళ్యాణి పాండునాయక్, కుర్మిండ్ల దామోదర్‌గౌడ్, జూపల్లి భరత్, కట్టా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విప్ సునీత, చిత్రంలో కలెక్టర్, అధికారులు

విద్యార్థులకు రాత పుస్తకాలు

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేయనున్న ప్రభుత్వం
- 20వ తేదీన విద్యా దినోత్సవం రోజున పంపిణీ
- 59,996 మందికి లబ్ధి



రామన్నపేట : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు, నోటు బుక్స్ కూడా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. కాగా జిల్లా వ్యాప్తంగా ఈనెల 20వ తేదీన విద్యా దినోత్సవం రోజు నోట్ బుక్స్ పంపిణీ చేయడానికి ఆ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు పాఠ్య పుస్తకాలు మాత్రమే అందజేస్తున్న ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి ఉచితంగా నోట్ బుక్స్ కూడా పంపిణీ చేయనుండడంతో పేద కుటుంబాలకు ఆర్థిక భారం తప్పనుంది.

పాఠశాలలు, విద్యార్థులు

జిల్లాలో 488 ప్రాథమిక, 70 ప్రాథమికోన్నత, 171 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 59,996 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తోంది. నోట్ బుక్స్‌ను విద్యార్థులే కొనుగోలు చేయాల్సి వచ్చేది. ఇందుకోసం ఒక్కొక్కరికి సగటున ఏడాదికి రూ.2 వేల వరకు ఖర్చు అయ్యేది. 8, 9, 10వ తరగతి రూ.2వేల పైనే ఉంటుంది. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో వేర్వేరుగా వర్క్ బుక్స్, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు నోట్ బుక్స్ ఉచితంగా పంపిణీ చేయనుండడంతో తల్లిదండ్రులకు భారం తగ్గనుంది.

ఒక్కో విద్యార్థికి పంపిణీ చేయనున్న నోట్ బుక్స్ ఇలా..

6వ తరగతి విద్యార్థులకు 200 పేజీలు గల ఐదు సింగిల్ రూల్, ఒక వైట్ లాంగ్ నోట్ బుక్, 7వ తరగతి 4 సింగిల్ రూల్, రెండు వైట్ నోట్ బుక్స్, 8వ తరగతి 7 వైట్ నోట్‌బుక్స్, 9, 10 తరగతుల విద్యార్థులకు 14 వైట్ నోట్ బుక్స్ చొప్పున పంపిణీ చేయనున్నారు.

ప్రభుత్వం ఇస్తుందని నోట్స్ కొనలేదు



పాఠ్యపుస్తకాలతో పాటు ప్రభుత్వం నోటు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తదని తెలిసింది. అందుకే ఈ సారి నోట్‌బుక్స్ కొనలేదు. ఉపాధ్యాయులు పాఠాలు మొదలుపెట్టారు. వీలైనంత త్వరగా నోట్ పుస్తకాలు ఇవ్వాలి.

– సిలువేరు వరుణ్‌తేజ, 9వ తరగతి విద్యార్థి

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తుంది. మన ఊరు – మన బడి కార్యక్రమం కింద పాఠశాలల్లో 12రకాల వసతులను కల్పిస్తుంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా డెస్క్ బెంచీలు, బోర్డులు ఫ్యాన్లు సమకూరుస్తుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి.

– కన్నెబోయిన జ్యోతి, ఎంపీపీ, రామన్నపేట

భారం తగ్గుతుంది



మా ఇద్దరు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారు. ప్రభుత్వం పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు, వర్క్‌బుక్‌లు ఇస్తుండడంతో చాలావరకు భారం తగ్గుతుంది. మాలాంటి పేద కుటుంబాలకు ఇది ఎంతో ఉపయోగకరం. వర్క్‌బుక్‌ల వల్ల పిల్లల్లో చదువుపై మరింత ఆసక్తి పెరుగుతుంది. ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం.

– తుంగ గోవర్ధన్, విద్యార్థి తండ్రి, సిరిపురం

పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం



విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ నూరు శాతం అందుబాటులోకి వచ్చాయి. దాదాపు అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. నోట్‌బుక్స్ కూడా జిల్లా కేంద్రానికి వచ్చాయి. మరికొన్ని రావాల్సి ఉంది. ఈనెల 20న విద్యా దినోత్సవం రోజున విద్యార్థులకు పంపిణీ చేస్తాం. ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు అవసరమైన వర్క్‌బుక్స్ రావాల్సి ఉంది.

– నారాయణరెడ్డి, డీఈఓ

ఎన్‌రోల్‌మెంట్ పెరుగుతుంది



ఇప్పటి వరకు కొన్ని పాఠశాలల విద్యార్థులకు మాత్రమే దాతల సహకారంతో ఉచితంగా నోట్ పుస్తకాలు అందుతున్నాయి. ప్రభుత్వమే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ ఉచితంగా నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్స్ పంపిణీ చేయాలని నిర్ణయించడం శుభ పరిణామం. తల్లితండ్రులపై భారం తగ్గుతుంది. ఎన్‌రోల్‌మెంట్ పెరుగుతుంది. విద్యార్థులు తల్లితండ్రులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి.

– కె.రవికుమార్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

వ్యక్తిపై గొడ్డలితో దాడి

ఆత్మకూర్‌-ఎస్‌(సూర్యాపేట) : ఇంటి స్థలం వివాదంలో వ్యక్తిపై గొడ్డలితో దాడికి పాల్పడిన ఘటన ఆత్మకూర్‌ (ఎస్‌) మండల పరిధిలోని కందగట్లలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కందగట్ల గ్రామానికి చెందిన సామ శ్రీనివాస్‌రెడ్డికి, ముద్దం నరసింహారెడ్డికి మధ్య ఇంటి స్థలం విషయంలో గొడవలు జరుగుతుండేవి. శనివారం ఇంటి స్థలం భూమిని కొలిచేందుకు వెళ్లగా స్థలం పక్కన ఉన్న మద్ది నరసింహారెడ్డి కుటుంబ సభ్యులు, శ్రీనివాస్‌ రెడ్డి మధ్య వివాదం ఏర్పడింది. ఈ ఘర్షణలో మద్ది నరసింహారెడ్డి, ఆయన కుమారుడు ప్రమోద్‌ రెడ్డిలు శ్రీనివాస్‌ రెడ్డి పై గొడ్డలితో దాడి చేయడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయాలపాలైన శ్రీనివాస్‌రెడ్డిని సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్‌ రెడ్డి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన మద్ది నరసింహారెడ్డి, ప్రమోద్‌రెడ్డి లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదవేందర్‌ రెడ్డి తెలిపారు.

ఫోన్‌ చోరీ చేసి..


మిర్యాలగూడ అర్బన్‌: జేబులో ఉన్న సెల్‌ ఫోన్‌ చోరీ చేసి ఫోన్‌ యాప్‌ ద్వారా బ్యాంక్‌ ఖాతాలో ఉన్న నగదు కాజేసిన ఘటన ఇటీవల మిర్యాలగూడలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణానికి చెందిన లక్ష్మీపతి ఈ నెల 12న హైదరాబాద్‌ వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కే సమయంలో ఆయన ఫోన్‌ చోరీకి గురైంది. అనంతరం మరుసటి రోజు అదే నంబర్‌పై మరో సిమ్‌ తీసుకుని ఫోన్‌ పే చెక్‌ చేసుకోగా అందులో ఒక సారి రూ.40,400, పది నిమిషాల తరువాత మరో రూ.50,500 రూపాయలు ఇతరుల ఖాతాలోకి మొత్తం రూ.91వేలు వెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే పట్టణంలోని టూ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో తన సెల్‌ ఫోన్‌ పోయిందని ఫిర్యాదు చేశాడు.

బావిలో పడి వ్యక్తి మృతి

వలిగొండ : వ్యవసాయ బావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం వలిగొండ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండలంలోని వెల్వర్తికి చెందిన మీసాల నర్సింహ (50) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగా జంగారెడ్డి పల్లెకు చెందిన రైతు కొకుంట్ల సత్తిరెడ్డి వద్దకు కూలి పనికి వెళ్లాడు. అక్కడ బావిలోనుంచి విద్యుత్‌ మోటారును పైకి తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి నీట మునిగిపోయాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి వెళ్లి మోటార్ల ద్వారా నీటిని తీసి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్‌ తెలిపారు.

నాన్నే తొలి హీరో..

నాన్నంటే.. ఓ ధైర్యం, బాధ్యత, భరోసా, త్యాగం, ఓర్పు, బిడ్డల భవిష్యత్‌. తల్లి నవమాసాలు మోసి బిడ్డలను కంటే.. ఆ బిడ్డలకు జీవితాన్ని ప్రసాదించేవాడే నాన్న. ప్రతి బిడ్డ ఎక్కే తొలి విమానం నాన్న భుజమే. ఏ బిడ్డకైనా నాన్నే తొలి హీరో. బిడ్డలు ఓడినప్పుడు ధైర్యాన్ని ఇచ్చేవాడు.. గెలిచినప్పుడు పదిమందికి చెప్పుకుని ఆనందపడే గొప్ప వ్యక్తి నాన్న. బిడ్డల జీవితాన్ని నిలబెట్టేందుకు నిరంతరం యంత్రంలా శ్రమించే దైవమే నాన్న. బిడ్డలకు అడుగులు వేయడం నేర్పిస్తూ.. జీవితంలోని తప్పటడుగులను సరిచేస్తూ బిడ్డలను గెలుపు ముంగిటకు తీసుకెళ్లేది కేవలం నాన్నే. నేడు ఫాదర్స్‌ డే సందర్భంగా ప్రత్యేక కథనాలు..



నాన్నే నాకు రోల్‌ మోడల్‌

- నల్లగొండ ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ : నాన్నే నాకు రోల్‌ మోడల్‌. ఆయన నుంచే నేను సేవాగుణాన్ని అలవర్చుకున్నానని నల్లగొండ ఎస్పీ అపూర్వరావు అంటున్నారు. ఫాదర్స్‌డే సందర్భంగా ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే.. నేను మా అక్క ఇద్దరం ఆడ పిల్లలం. మా నాన్న మగపిల్లల కంటే ఆడపిల్లలు తక్కువ కాదని చెబుతూ మమ్ములను పెంచారు. మా ఇంటికి ఎవరు వచ్చినా అన్నం పెట్టి పంపించేవారు. తనకు చేతనైన సాయం చేసేవారు. అదే మాకు కూడా చిన్నప్పటి నుంచి అలవాటైంది. నాన్న ఆలోచనలకు అనుగుణంగా నేను మా అక్క నడుచుకున్నాం. మా చదువు విషయంలో అమ్మ ఎక్కువగా శ్రద్ధ తీసుకుంటే.. నాన్న మిగతా అన్ని విషయాల్లో రోల్‌మోడల్‌గా ఉండేవారు. నాన్న ఆలోచన, నాన్న ప్రోత్సాహంతోనే నేను ఈ రోజు ఐపీఎస్‌ స్థాయిలో ఉన్నాను. ఇప్పుడు మా కుటుంబం ఎంతో ఆనందంగా ఉంది.



తండ్రి నాగేశ్వర్‌రావుతో ఎస్పీ అపూర్వరావు

నాన్న మాటే నాకు ప్రేరణ

- ఎప్పటికైనా నువ్వు కలెక్టర్‌వు అవుతావు అనే వారు
- సూర్యాపేట కలెక్టర్‌ ఎస్‌.వెంకట్రావు


దురాజ్‌పల్లి (సూర్యాపేట) : 'కష్టం, మంచితనానికి మారు పేరు మా నాన్న. ఎవ్వరికి ఏ కష్టం వచ్చినా తనకు వచ్చినట్టే బాధపడే వారు. ఉన్నత చదువు చదివితే సరిపోదు.. అది ప్రజలకు ఉపయోగపడాలి అని మా నాన్న అన్న మాటలే ఇప్పటికీ నాకు స్ఫూర్తి. చిన్నతనంలో తన వెంట తీసుకెళ్లేవాడు. అప్పుడే గ్రామీణ ప్రజల కష్టనష్టాలు ప్రత్యక్షంగా చూశా' అని సూర్యాపేట కలెక్టర్‌ ఎస్‌.వెంకట్రావు తన తండ్రితో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

కష్టాన్ని నమ్ముకోవాలని చెప్పేవారు..

మాది ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా సాలూరు. మాది వ్యవసాయ కుటుంబం. మా నాన్న గారు ఎస్‌.కామరాజు 1975–1980 మధ్య కాలంలోనే అధునిక వ్యవసాయం చేసేవారు. నాకు, మాఅన్న రాముకు 10, 12 ఏళ్ల వయస్సులోనే మా నాన్న వ్యవసాయం నేర్పేవారు. ఎప్పుడైనా కష్టాన్ని నమ్ముకోవాలని, చేసిన కష్టం ఎప్పుడూ వృథా కాదు అని చెప్పేవారు. ఎప్పటికైనా నీవు ఐఏఎస్‌ అవుతావు అని అనేవారు. ఎక్కడ ఏ పని చేసినా ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని సూచించేవారు. కానీ, నాకు అప్పుడు ఐఏఎస్‌ అంటే ఏంటో తెలియదు. నా 18 ఏళ్ల వయస్సులో డిగ్రీ మొదటి సంవత్సరంలో ఉన్నపుడు 1984లో హఠాత్తుగా గుండెపోటుతో నాన్న నా చేతిలోనే మరణించారు. ఆ రోజు తలుసుకుంటే ఇప్పటికీ నా హృదయం బరువెక్కుతుంది.



ఎస్‌. వెంకట్రావు సూర్యాపేట జిల్లా కలెక్టర్‌



ఎస్‌. కామరాజు (ఫైల్‌)

1989లోనే గ్రూప్‌–2 సాధించా..

ఉన్నత చదువు చదివితే సరిపోదు.. అది ప్రజలకు ఉపయోగపడాలని నాన్న చెప్పిన మాటలను మదిలో ఉంచుకొని 1989లోనే గ్రూప్‌–2 సాధించా. డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టి అక్కడ నుంచి కలెక్టర్‌ వరకు వివిధ హోదాల్లో పని చేశా. ప్రజలకు సాయం చేయడంలో ఉన్నంత సంతృప్తి ఎందులోనూ ఉండదు. ప్రజా సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తా. ప్రభుత్వ పథకాలను అట్టడుగు ప్రజలకు చేరవేయడమే నా లక్ష్యం.

నాన్నే బతకడం నేర్పాడు



తండ్రి అంతిరెడ్డితో సోమిరెడ్డి

కోదాడ : సాధారణ రైతు కుటుంబం, వ్యవసాయమే జీవనధారం, నిత్యం కష్టం చేస్తే తప్ప జీవనం గడవని పరిస్థితిలో నాతో పాటు ఇద్దరు తమ్ముళ్లను చదివించడమే కాకుండా విలువలతో బతకడం నేర్పిన మా నాన్నే మాకు స్ఫూర్తి అంటున్నారు కోదాడకు చెందిన రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ ఉస్తేల సోమిరెడ్డి. ఫాదర్స్‌డే సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. మా నాన్న ఉస్తేల అంతిరెడ్డి హుజూర్‌నగర్‌ సమీపంలోని బక్కమంతులగూడెంలో వ్యవసాయం చేసేవారు. చిన్నతనం నుంచే చదువు విలువ ఏంటో నిత్యం చెప్పేవాడు. గ్రామీణ వాతావరణంలో పెరిగిన నేను ఇంటర్‌లో తప్పడంతో ఇంటి వద్దే ఉన్నాను. కానీ, అప్పుడు కూడా చదువుకే ప్రాధాన్యం ఇవ్వాలని చెబుతూ ఇంటి వద్దే చదివించి ఇంటర్‌ పాస్‌ కాగానే డిగ్రీలో చేర్పించాడు. వ్యవసాయంలో తాను పడుతున్న కష్టం మీరు పడవద్దని చెప్పేవాడు. ఆయన ఇచ్చిన మనోధైర్యంతో నాతో పాటు ఇద్దరు తమ్ముళ్లు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాం.

భవిష్యత్‌కు మార్గదర్శి నాన్నే

- ట్రైని ఎస్పీ శేషాద్రినిరెడ్డి

నల్లగొండ రూరల్‌ : నా భవిష్యత్‌కు మార్గదర్శి మా నాన్నే అంటున్నారు నల్లగొండ ట్రైనీ ఎస్పీ శేషాద్రినిరెడ్డి. ఫాదర్స్‌డే సందర్భంగా ఆమె తన తండ్రితో ఉన్న అనుబంధాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు. వివరాలు ఆమె మాటల్లోనే.. పాఠశాల విద్య నుంచి ఐఐటీ వరకు ప్రతి పాఠశాలను, కళాశాలను నాన్నే ఎంపిక చేశారు. మా అమ్మ కవిత, నాన్న సుధాకర్‌రెడ్డి మంచి విద్యను అందించేందుకు కృషి చేశారు. నాకు ఐఐటీ హైదరాబాద్‌లో సీటు రావడంతో నాన్నకు సంతోషం కలిగింది. ఇక్కడి నుండే సివిల్స్‌కు సన్నద్ధం చేశారు. ఢిల్లీలో కోచింగ్‌ తీసుకుంటానని చెప్పినప్పటికీ మా నాన్న వద్దని నేను నీకు సపోర్ట్‌గా ఉన్నానని.. ఆన్‌లైన్‌ కోచింగ్‌ గురించి వివరించారు. నాతో పాటు సివిల్స్‌ పుస్తకాలు చదివి నాకు చెప్పేవారు. కాంట్రాక్టర్‌గా ఎంత బిజీగా ఉన్నప్పటికీ నా కోసం ఎక్కువ సమయం కేటాయించి సివిల్‌ సర్వీస్‌ వైపు ప్రోత్సహించారు. మొదటిసారి సివిల్స్‌ రాకపోవడంతో నేను నిరుత్సాహపడ్డాను. మా నాన్న నా వెన్నుతట్టి ఏం కాదు మరో ప్రయత్నం చేయాలని మార్గ నిర్దేశం చేశారు. ఎలాంటి సమస్య వచ్చినా నాన్న నాకు పరిష్కార మార్గం చూపుతాడు. ఇప్పటికీ నాకు డ్రస్సులు మా నాన్నే కొనిస్తాడు. నాన్న మార్గదర్శకంతోనే సివిల్స్‌ సాధించగలిగాను.



కుటుంబ సభ్యులతో ట్రైనీ ఎస్పీ

టెన్నిస్‌ క్రీడాకారిణి అయ్యాను

నిడమనూరు : నాన్న (నూకల వేణుగోపాల్‌ రెడ్డి) కోసమే టెన్నిస్‌ క్రీడాకారిణి అయ్యాను. చిన్నప్పటి నుంచే పెద్ద క్రీడాకారిణి కావాలని ఉద్బోధిస్తూ, అందుకనుగుణంగా ప్రోత్సహిస్తూ వచ్చారు. దానికి తగ్గట్టుగానే శిక్షణ ఇప్పించారు. పోలీస్‌ డిపార్ట్‌మెంట్‌లో బిజీగా ఉన్నా, నా టెన్నిస్‌ ఉన్నతికి ప్రతి దశలోనూ ప్రోత్సాహం అందించారు. ఇటీవల ఉగాండాలోని కంపాలాలో నిర్వహించిన డబుల్స్‌ జూనియర్‌ టెన్నిస్‌ టోర్నీ ఫైనల్‌లో గెలిచి.. మెడల్‌ సాధించి నాన్నకు ఎంతో సంతోషాన్ని ఇచ్చాను అనుకుంటున్నా. నాన్న కోసం అంతర్జాతీయంగా టెన్నిస్‌లో, చదువులో ప్రతిభ చూపి పేరు తెచ్చుకోవడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాను. - షన్వితారెడ్డి, టెన్నిస్‌ క్రీడాకారిణి



తండ్రితో షన్వితారెడ్డి

బిడ్డల కోసం కాయకష్టం

చౌటుప్పల్ : జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా ఏమాత్రం అధైర్యపడకుండా బిడ్డలను ఉన్నత స్థితికి చేర్చాడు చౌటుప్పల్ మండలంలోని మసీదుగూడెం గ్రామ పంచాయతీ మదిర శేరీల గ్రామానికి చెందిన ఎడ్ల రాంరెడ్డి. 1994లో రాంరెడ్డి భార్య ఇద్దరు పిల్లలో ఓ ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. దీంతో మానసికంగా కుంగిపోయిన రాంరెడ్డి కొంత కాలం తర్వాత 1995లో కీసరకు చెందిన విజయను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు సింధు, శిల్ప జన్మించారు.

భార్య చనిపోవడంతో బిడ్డలకు అన్నీ తానై...

రాంరెడ్డి, విజయ ఇద్దరు కుమార్తెలతో కలిసి ఆనందంగా జీవనం సాగిస్తున్న క్రమంలో విజయ 2017లో పక్షవాతానికి గురై గుండెపోటుతో మృతిచెందింది. దీంతో కుమార్తెల బాధ్యత రాంరెడ్డిపై పడింది. ఏ మాత్రం అధైర్యపడకుండా పిల్లలకు ఏ లోటూ రాకుండా చూసుకున్నాడు. తాను ఎన్నో కష్టాలు పడుతున్నా ఆ విషయం కుమార్తెలకు తెలియకుండా ఉన్నత చదువులు చదివించాడు. మూడేళ్ల క్రితం పెద్ద కుమార్తె సింధుకు వివాహం చేశాడు. వివాహం తర్వాత ఆమె అమెరికాలో స్థిరపడింది. చిన్న కుమార్తెను కూడా ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికా పంపించాడు. తాను గ్రామంలోనే ఉంటూ వ్యవసాయం చేస్తున్నాడు.



ఇద్దరు కుమార్తెలు సింధు, శిల్పలతో ఎడ్ల రాంరెడ్డి

ఆటో బోల్తా .. మహిళ మృతి

గుర్రంపోడు : ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో మహిళ మృతిచెందింది. ఈ ఘటన గుర్రంపోడు మండలం లక్ష్మీదేవిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని వెల్లండపాడు వద్ద శనివారం జరిగింది. ఎస్‌ఐ శివప్రసాద్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంపోడు గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారి రేపాక నర్సమ్మ(55) వెల్లండపాడు గ్రామానికి ఆటోలో కూరగాయలను తీసుకుని వెళ్లి అమ్ముకుని తిరిగి వస్తోంది. ఈ క్రమంలో గ్రామ శివారులో ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో నర్సమ్మ రోడ్డు పక్కన పడిపోగా తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందింది.పాటో డ్రైవర్‌ నక్కనబోయిన సైదులుకు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డులో గుంతను తప్పించబోయి సడన్‌బ్రేక్‌ వేయడంతో ఈ ప్రమాదం జరిగింది. నర్సమ్మ మండల కేంద్రం సెంటర్‌లో రోడ్డు పక్కన కూరగాయలను అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. ఈమెకు సంతానం లేదు. ఈమె భర్త 20 ఏళ్ల క్రితమే చనిపోయాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పదిహేడు బ్యాటరీలు చోరీ

రాజాపేట : రాజాపేట మండలంలోని సింగారం గ్రామంలో ఏయిర్‌టెల్‌ టవర్‌కు చెందిన పదహేడు బ్యాటరీలు శనివారం చోరీకి గురయ్యాయి. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో ఏయిర్‌టెల్‌ టవర్‌కు చెందిన బ్యాటరీలను మే 28 సిబ్బంది పరిశీలించారు. శనివారం ఉదయం సిగ్నల్‌ రాకపోవడంతో తిరిగి టెక్నీషియన్‌ నాగరాజు పరిశీలించగా 17 బ్యాటరీలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈ విషయాన్ని సూపర్‌వైజర్‌ శ్రీనుకు తెలుపగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీను ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

వేర్వేరు చోట్ల నలుగురి బలవన్మరణం

వలిగొండ : రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వలిగొండ మండలంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గొల్లపెల్లికి చెందిన నామ పృథ్వీ (24) ప్రైవేట్‌ ఉద్యోగిగా జీవనం సాగిస్తున్నాడు. పృథ్వీ తండ్రి నామ సత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. తండ్రి అనారోగ్యానికి చేసిన అప్పులు తీర్చలేక పృథ్వీ ఆర్థి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే సీఐ పవన్‌ తెలిపారు.



పృథ్వీ (ఫైల్‌)

ఉరేసుకుని వృద్ధుడు..

రామగిరి(నల్లగొండ): ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం తిప్పర్తి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిప్పర్తి మండల కేంద్రానికి చెందిన తండు మల్లయ్య(60) భార్య సరోజనతో కలిసి ఉంటున్నాడు. భార్య సరోజనకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మల్లయ్య కారం మిల్లులు నడిపిస్తున్నారు. శుక్రవారం రోజు లాగానే భోజనం ముగించుకుని పడుకున్నారు. భార్య సరోజన అర్ధరాత్రి దాటిన తర్వాత లేచి చూసే సరికి మల్లయ్య కనిపించలేదు. చుట్టు పక్కల తెలిసిన వారిని అడిగినప్పటికీ మల్లయ్య ఆచూకీ తెలియలేదు. శనివారం తెల్లవారుజామున తమ ఇంటి ఎదురుగా దోర్నాల నగేష్‌కు చెందిన నిర్మాణంలో ఉన్న రెండు అంతస్తుల భవనంలో చూడగా మల్లయ్య ఉరి వేసుకుని ఉన్నట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మల్లయ్య మృతదేహానికి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే మల్లయ్య ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. మల్లయ్యకు వివాహమైన కొడుకు, కుమార్తె ఉన్నారు. భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్‌.ధర్మా తెలిపారు.

మోత్కూరులో వివాహిత..

మోత్కూరు: కుటుంబ తగాదాలతో ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పాలడుగు గ్రామానికి చెందిన బొడిగె శంకర్‌తో మిర్యాలగూడకు చెందిన లక్ష్మి (28) గత సంవత్సరం డిసెంబర్‌లో వివాహం జరిగింది. ఇటీవల భార్యాభర్తల మధ్య తగాదాలు తలెత్తడంతో గ్రామ పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అయినప్పటికీ శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకొని లక్ష్మి ఆత్మహత్యకు పాల్పడింది. వ్యవసాయ పనులకు వెళ్లిన కుటుంబ సభ్యులు సాయంత్రం ఇంటికి వచ్చి చూడటంతో అప్పటికే ఆమె మృతిచెందింది. మృతురాలి తల్లి పూలమ్మ సోదరుడు సైదులు గ్రామానికి చేరుకొని తమ కూతురు ఆత్మహత్యకు అత్తింటి వారే బాధ్యులని ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. మృతురాలి ఆత్మహత్యకు కారణాలు తెలియ రాలేదని, తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని, విచారిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఉరేసుకుని వ్యక్తి..

నేరేడుచర్ల : ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం రామాపురం రోడ్డులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నవీన్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం...నేరేడుచర్ల మండలం రామాపురానికి చెందిన మన్నెం రమేష్‌(39) ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్యభర్తల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. దీంతో రమేష్‌ భార్య రేణుక తన బంధువుల ఊరు అయినా గరిడేపల్లి మండలం పోనుగోడుకు వెళ్లింది. దీంతో మనస్తాపంతో రమేష్‌ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 15 ఏళ్ల క్రితం వీరికి వివాహం కాగా ఇద్దరు పిల్లలు. నాలుగు రోజులుగా బంధువుల ఇంట్లో వివాహం ఉండటంతో వెళ్లి ఉదయం వచ్చారు. రమేష్‌ ఇంటికి రాగానే చేపల కోసం వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో భార్య రేణుక ఇంటి నుంచి వెళ్లిపోయింది. మనస్తాపంతో ఉరి వేసుకొని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు చూడటంతో ఈ విషయం బయటకు వచ్చింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వడదెబ్బతో ఒకరి మృతి

నకిరేకల్‌ : నకిరేకల్‌ పట్టణంలోని వాసవీనగర్‌కు చెందిన గంజి రమేష్‌ (37) వడదెబ్బతో శనివారం సాయంత్రం మృతి చెందాడు. రమేష్‌ మూడు రోజులుగా వడదెబ్బకు గురై ఇంటి వద్ద చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కృష్ణానదిలో పడి సాఫ్ట్‌వేర్‌ ఇంజనీర్‌ మృతి

మఠంపల్లి: కృష్ణానదిలో పడి ఓ సాఫ్ట్‌వేర్‌ ఇంజనీర్‌ మృతిచెందాడు. ఈ ఘటన మట్టపల్లిలో శనివారం జరిగింది. మఠంపల్లి ఎస్‌ఐ సీహెచ్‌ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు (పల్నాడు) జిల్లా పిడుగురాళ్లకు చెందిన మాశెట్టి సుబ్బారావు, రాజేశ్వరి దంపతుల పెద్దకుమారుడైన మాశెట్టి సుబ్రహ్మణ్యం (31)మలేషియాలో సాఫ్ట్‌వేర్‌ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఈతడి తండ్రి సుబ్బారావు గుంటూరు జిల్లాలోనే కృష్ణానదీతీరంలో గల దైదా పుణ్యక్షేత్రానికి వెళ్లి ప్రమాదవశాత్తు నది లోపడి మృతిచెందాడు. అప్పటి నుంచి సుబ్రహ్మణ్యం మానసికవ్యాధికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు విజయవాడలోని కృష్ణాన్యూరో సెంటర్‌నందు మానసిక వైద్యుని పర్యవేక్షణలో చికిత్స నిర్వహిస్తూ పిడుగురాళ్లలోని ఇంటివద్దే ఉంచుతున్నారు.అయితే సుబ్రహ్మణ్యం మాత్రం మానసిక స్థితి మెరుగుపడక ఎప్పుడూ ఒంటరిగా ఉంటూ ఆలోచిస్తూండేవాడు.అదే మానసిక స్థితితో ఇంటినుంచి ఈనెల16న ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయి మట్టపల్లి వద్ద కృష్ణానదిలో శవమైతేలాడు. కాగా సమాచారం తెలుసుకున్న పోలీసులు నదిలోనుంచి మృతదేహాన్ని బయటకుతీశారు. మృతదేహం ఫోటోలు సోషల్‌ మీడియాలో చూసిన కుటుంబసభ్యులు,బంధువులు మట్టపల్లికి చేరుకుని సుబ్రహ్మణ్యంగా గుర్తించారు. మృతుడు మానసిక స్థితి సరిగాలేకనే నదిలోపడి చనిపోయాడని అతని తమ్ముడు మాశెట్టి వెంకటశ్రీనివాసరావుమఠంపల్లి పోలీసులకు ఫిర్యాదుచేశారు. మృతుడు అవివాహితుడు తల్లి,తమ్ముడు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



సుబ్రహ్మణ్యం(ఫైల్‌)

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

చౌటుప్పల్ : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందింది. ఈ ఘటన చౌటుప్పల్‌ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారంలో శనివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని మీర్‌ఆలమ్‌మండి పరిధిలోని జగ్జీవన్‌నగర్‌కు చెందిన తోకల శోభ(36) భర్త నగేష్‌, ఇద్దరు కుమార్తెలతో కలిసి లక్కారం గ్రామంలోని చర్చికాలనీలో కొంత కాలంగా నివాసం ఉంటున్నారు. వీరికి 19సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. నగేష్‌ గతంలో పాత టైర్ల వ్యాపారం చేసేవాడు. శోభ ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలోని దివీస్‌ పరిశ్రమలో స్వీపర్‌గా పనిచేస్తోంది. ఆ క్రమంలో ఈనెల 15న శోభ ఇంటి వద్దే ఉండగా భర్త, పిల్లలు, స్వగ్రామానికి వెళ్లారు. శుక్రవారం రాత్రి తన తండ్రి వద్ద తల్లికి చెందిన సెల్‌ఫోన్‌ ఉండడాన్ని కుమార్తె ప్రసన్న గుర్తించింది. తల్లి యోగక్షేమాలు తెలుసుకోవాలన్న ఆలోచనతో లక్కారంలోని పక్కింటి వారికి ఫోన్‌ చేసింది. దాంతో వారు ఇంటికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ శోభ చనిపోయి కన్పించింది. వారిచ్చిన సమాచారం మేరకు కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా మృతురాలు ఆత్మహత్యకు పాల్పడిందా, లేదంటే మరేదైనా జరిగిందా అనే విషయం తెలియరాలేదు. మృతురాలి కుమార్తె ప్రసన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ దేవేందర్‌ తెలిపారు.

బాలికపై లైంగిక వేధింపులు

మిర్యాలగూడ అర్బన్‌: మైనర్‌ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో సదరు వ్యక్తిపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ సంఘటన శనివారం రాత్రి మిర్యాలగూడలో చోటు చేసుకుంది. వివరాలు.. మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌ కు చెందిన ఓ బాలికను గకొద్ది రోజులుగా సీతారంపురానికి చెందిన జావెద్‌ వేదింపులకు గురిచేశాడు. విషయాన్ని సదరు బాలిక కుటుంబ సభ్యులకు చెప్పింది. దీంతో శనివారం రాత్రి కూడా బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆగ్రహించిన బాలిక కుటుంబ సభ్యులు టూ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పరారీలో ఉన్న జావెద్‌ బాలిక కుటుంబ సభ్యులతో బేరసారాలు ఆడినట్లు సమాచారం. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్‌ ఎస్‌ఐ క్రిష్ణయ్య పేర్కొన్నారు.

గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే రమావత్‌ రవీంద్రకుమార్‌
- దేవరకొండ, గుర్రపుతండాలో గిరిజనోత్సవం

దేవరకొండ, కొండమల్లేపల్లి: గిరిజనుల సంక్షేమానికి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే రమావత్‌ రవీంద్రకుమార్‌ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం దేవరకొండ పట్టణం, కొండమల్లేపల్లి మండలం గుర్రపుతండాలో వేర్వేరుగా తెలంగాణ గిరిజనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు సంప్రదాయ నృత్యాలతో దేవరకొండ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయా చోట్ల ఏర్పాటు చేసిన సమావేశాల్లో కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి, ట్రైకార్‌ చైర్మన్‌ రాంచందర్‌నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. తండాలకు పంచాయతీల హోదాతోనే గిరిజనులకు ప్రభుత్వం పాలనాధికారం వచ్చిందన్నారు. గిరిజనులకు 10శాతం రిజర్వేషన్లు అందించిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అన్నారు. గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. అనంతరం ట్రైకార్‌ చైర్మన్‌ ఇస్లావత్‌ రాంచందర్‌నాయక్‌ మాట్లాడుతూ తండాలను గ్రామపచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి ఏటీడీఓ రాజ్‌కుమార్‌, ఎంపీపీలు పద్మ హన్మానాయక్‌, సునీతజనార్దన్‌రావు, జెడ్పీటీసీ బాలునాయక్‌, నాయకులు వడ్త్య దేవేందర్‌నాయక్‌, ముక్కమళ్ల బాలయ్య పాల్గొన్నారు.